# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 13-10-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 66 | పేజీలు:4 | వెల: రూ.1/-


## రసాయన కర్మాగారంలో గ్యాస్ లీకేజీ.. 34 మందికి అస్వస్థత

ముంబై, అక్టోబర్ 12:: మహారాష్ట్ర అంబర్‌నాథ్‌లో మంగళవారం ఓ రసాయన కర్మాగారంలో గ్యాస్ లీక్ కావడంతో 30 మందికిపైగా ఆసుపత్రి పాలయ్యారు. కర్మాగారం సమీపంలో నివసిస్తున్న స్థానికులు ఊపిరి ఆడకపోవడం, కళ్లల్లో మంట, వికారం, ఇతర ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరారని థానే మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతీయ విపత్తు నిర్వహణ సెల్ చీఫ్ సంతోష్ కదం తెలిపారు. ఉదయం 10 గంటల సమయంలో అంబర్‌నాథ్‌లోని మహారాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఓఎఆఅ)లో ఉన్న ఓ ప్లాంట్ నుంచి సల్ఫ్యూరిక్ యాసిడ్ లీక్ అయినట్లు ఆయన చెప్పారు.

ఆ తర్వాత శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఇతర సమస్యలతో 34 మంది ఉల్లాస్‌నగర్‌లోని సెంట్రల్ ఆసుపత్రిలో చేరారినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వారంతా చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని తెలిపారు. ఘటన అనంతరం అప్రమత్తమైన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని, గ్యాస్ లీక్ కాకుండా చర్యలు చేపట్టారు. లీకేజీకి గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ జరుపుతున్నట్లు సంతోష్ కదం వివరించారు.

## రాష్ట్రంలో విద్యుత్ కోతలకు ఆస్కారమే లేదు : మంత్రి జగదీశ్ రెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 12: దేశ వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తిపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మాత్రమే అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు వందల ఏండ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయి.. తెలంగాణలో విద్యుత్ కోతలకు ఆస్కారమే లేదని మంత్రి తేల్చిచెప్పారు. ఒక్క నిమిషం కూడా రాష్ట్రంలో పవర్ కట్ ఉండదన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను హైదరాబాద్‌కు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మళ్ళీ హైదరాబాద్ నుండి ఇతర జిల్లాలకు సరఫరా చేసేలా విద్యుత్ వలయం ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. హైడల్ పవర్ ఉత్పత్తి కూడా బాగుందన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం, మణుగూరులో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ తెలంగాణకు పూర్తిస్థాయిలో సరిపోతుంది అని మంత్రి స్పష్టం చేశారు. గత ఏడాది 16 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ అవసరం ఉంటే అంతే మొత్తంలో సరఫరా చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

కేంద్ర నిర్ణయాలతో తీవ్ర ఇబ్బందులు

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల రాబోయే రోజుల్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి జగదీశ్ రెడ్డి చెప్పారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రంలో కూడా విద్యుత్ కోతలు వచ్చే అవకాశం ఉంది. దీనికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చట్టాల వలన రాష్ట్రంలో విద్యుత్ కోతలు వస్తాయి కానీ ఇప్పుడు మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేవు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రంలో ఎక్కడ కూడా కోతలు లేవు. ప్రైవేట్ కంపెనీలకు విద్యుత్ సంస్థలను ధారాదత్తం చేసేందుకే ఈ బొగ్గు కృత్రిమ కొరత అని నిపుణులు అంటుంటే నిజమే అనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతోనే ఇవాళ దేశంలో విద్యుత్ కోతలు సంభవించాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాయొద్దు అని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు.

## సీఎం కేసీఆర్ పెద్దమనసు..

## యువతికి రూ.25 లక్షల సాయం



హైదరాబాద్ , అక్టోబర్ 12:ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి పెద్ద మనసు చాటారు. అరుదైన వ్యాధితో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న యువతికి చికిత్స అందించేందుకు రూ. 25 లక్షలు మంజూరు చేశారు. వనపర్తి నియోజకవర్గం రేవల్లికి చెందిన శివాని.. పరోక్సిస్మాల్ నాక్టర్నాల్ హిమోగ్లోబినురియా (ఖఔఊ) అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేసేందుకు రూ. 30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో యువతి ప్రాణాలు నిలిపే అవకాశం ఉంది. అయితే, వైద్యానికి డబ్బులు లేకపోవడంతో యువతి కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి దృష్టికి రేవల్లి గ్రామస్తులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి నిరంజన్ రెడ్డి.. శివాని ఆరోగ్య పరిస్థితిని మంత్రి.. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దమనసుతో శివాని చికిత్స నిమిత్తం రూ. 25 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేశారు. ఎల్‌వోసీని మంగళవారం యువతి తండ్రి బాల్ రెడ్డికి మంత్రి నిరంజన్ రెడ్డి అందజేశారు. దీంతో హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో శివానికి చికిత్స చేయనున్నారు. శివాని కుటుంబ సభ్యులు సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అరణ్య భవన్‌లో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

హైదరాబాద్ , అక్టోబర్ 12: రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌లో బతుకమ్మ పండగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రంగు రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో ఉద్యోగినులు ఆడిపాడారు. దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించిన ఉద్యోగులు నవరాత్రి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.ఎం. డోబ్రియల్ ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ మహిళలు బతుకమ్మ ఉత్సవాలు జరుపుకోవటం సంతోషంగా ఉందని డోబ్రియల్ అన్నారు. అరణ్య భవన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



(అక్టోబర్ 13 రచయిత్రి అబ్బూరు ఛాయాదేవి జననం...)

-రాధశ్రీ

సెల్: 9494481210



## కృష్ణా జలాల్లో 50 శాతం వాటాకు తెలంగాణ డిమాండ్

హైదరాబాద్ , అక్టోబర్ 12:సోమాజిగూడలోని జలసౌధ కార్యాలయంలో మంగళవారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశం అయింది. కేఆర్ఎంబీ చైర్మన్ ఎంపీ సింగ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ అమలుపై చర్చించనున్నారు. ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తెచ్చే అంశంతో పాటు ఉప సంఘం నివేదికపై కృష్ణా బోర్డు సమావేశంలో చర్చించనున్నారు.

ఈ సమావేశానికి హాజరయ్యే కంటే ముందు తెలంగాణ సాగునీటిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల్లో 50 శాతం వాటా కోరుతున్నాం. ప్రాజెక్టుల నిర్వహణ ఎలా చేస్తారని అడుగుతున్నాం? ఇవాళ్టి సమావేశం తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. బోర్డు పరిధిలోకి ఏ ప్రాజెక్టులు ఇవ్వాలనేది చర్చిస్తామన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు వాటా పెరగాలి. నదీ పరివాహక ప్రాంతం తెలంగాణలో అధికంగా ఉంది. నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్, కల్వకుర్తి ప్రాజెక్టుకు నికర జలాలు కేటాయించాలి. వాటా ప్రకారం తెలంగాణకు 570 టీఎంసీలు కేటాయించాలి. కొత్త ట్రిబ్యునల్ వచ్చే వరకు మరో 105 టీఎంసీలు ఇవ్వాలన్నారు. బోర్డు పరిధిలో విద్యుత్ ప్రాజెక్టులూ ఉండాలని కోరుతున్నారు. తెలంగాణలో అనేక ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఈ క్రమంలో నీటి వాటాతో పాటు విద్యుత్ ఉత్పత్తి కూడా తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఎత్తిపోతల పథకాలు, బోరుబావులకు విద్యుత్ ఉత్పత్తి చేయాలి అని రజత్ కుమార్ డిమాండ్ చేశారు.

## ప్రధాని మోదీ సలహాదారుగా అమిత్ ఖరే

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: సమాచార, ప్రసార శాఖ మాజీ కార్యదర్శి అమిత్ ఖరేను మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ సలహాదారుగా నియమించారు. ఈయన 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఉన్నత విద్య శాఖ కార్యదర్శిగా పనిచేసి సెప్టెంబర్ 30న రిటైర్ అయ్యారు. సమర్థవంతమైన, క్రమశిక్షణ కలిగిన బ్యూరోక్రాట్‌గా అమిత్‌కు పేరుంది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా గతేడాది కొత్త జాతీయ విద్యా విధానాన్ని తీసుకురావడంతోపాటు సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా డిజిటల్ మీడియా నియంత్రణలకు సంబంధించి కూడా కీలక మార్పులు తీసుకొచ్చిన ఘనత అమిత్ ఖరే సొంతం. ప్రధాని మంత్రి సలహాదారులుగా పీకే సిన్హా, అమర్‌జీత్ సిన్హా ఈ ఏడాది తప్పుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు వారి స్థానంలో అమిత్ ఖరే.. పీఎంవోలోకి వెళ్లనున్నారు. పూర్తి పారదర్శకతతో స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటారని అమిత్‌కు పేరుంది.






## పారిశ్రామిక మహిళకు ఆర్థిక చేయూత ఎంతో కీలకం: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ , అక్టోబర్ 12: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆర్థికంగా చేయూత అందించడం ఎంతో అవసరమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) నాలుగో స్త్రీ శక్తి అవార్డుల కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు.

మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ వినోభా దేవికి స్త్రీ రత్న అవార్డు, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పుష్పలతా దేవికి స్త్రీ మూర్తి అవార్డు, ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనూషకు స్త్రీ శక్తి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ..ఒక మహిళకు అవార్డు ఇచ్చామంటే, ఆ మహిళను ఆదర్శంగా తీసుకునే పిల్లలకు, కుటుంబానికి కూడా అవార్డు ఇచ్చి ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు.

వాడవాడలా బతుకమ్మ జరుపుతూ స్త్రీని దేవతగా పూజించే పవిత్రమైన నవరాత్రి సమయంలో స్త్రీ శక్తి అవార్డు ఇవ్వడం సంతోషకరంగా ఉందని కవిత తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు ఆరుకోట్ల మంది పారిశ్రామికవేత్తలు సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఇందులో కేవలం 15 శాతం మాత్రమే మహిళల భాగస్వామ్యంలో నడుస్తున్నాయన్నారు. ఈ 15 శాతంలో 80 శాతం మహిళలు సొంతంగా వ్యాపారాలను నిర్వహిస్తుండగా మిగిలిన 20 శాతం మంది ప్రైవేటు, ప్రభుత్వ ఆర్థిక సహాయంతో పరిశ్రమలు నిర్వహిస్తున్నారని వివరించారు. పారిశ్రామిక రంగంలో అడుగుపెట్టిన మహిళలు, ఔత్సాహిక మహిళలకు వీలైనంత సాయపడాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు.

పారిశ్రామిక రంగంలోకి ప్రవేశించాలనుకునే మహిళలకు, యువతకు అన్ని రకాలుగా సలహాలు అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మహిళా పారిశ్రామిక వేత్తలను ఎమ్మెల్సీ కవిత కోరారు. అంతర్జాతీయ గైనకాలజిస్టుల అసోసియేషన్‌కు కార్యదర్శిగా ఎంపికైన తెలుగు మహిళ డా. శాంతికుమారిని ఎమ్మెల్సీ కవిత అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, పారిశ్రామిక వేత్తలతో కలిసి కవిత బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

అవార్డు వేడుకల్లో భాగస్వామ్యం చేసినందుకు నిర్వాహకులకు ఎమ్మెల్సీ కవిత ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఐఏఎస్ కరుణ వాకాటి, పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## కేఆర్ఎంబీ పరిధిలోకి సాగర్, శ్రీశైలం.. ఈ నెల 14 నుంచి కేంద్ర గెజిట్ అమల్లోకి!

హైదరాబాద్ , అక్టోబర్ 12:కేంద్ర జలశక్తి శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 14 నుంచి అమల్లోకి వస్తున్నట్లు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) మంగళవారం ప్రకటించింది. రెండో షెడ్యూల్‌లోని అన్ని డైరెక్ట్ అవుట్ లెట్లను బోర్డు పరిధిలోకి తీసుకోనున్నట్లు కేఆర్ఎంబీ తెలిపింది. ఈ నేపథ్యంలో శ్రీశైలం, నాగార్జుసాగర్ ప్రాజెక్టుల అన్ని డైరెక్ట్ అవుట్‌లెట్లు బోర్డు పరిధిలోకి వెళ్లనున్నాయి. అవుట్‌లెట్ల అప్పగింతకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు రావాలని కేఆర్ఎంబీ కోరింది.

మరోవైపు తెలంగాణకు కృష్ణా జలాల్లో వాటా కేటాయించే వరకు గెజిట్ నోటిఫికేషన్ ఆపాలని తెలంగాణ సాగునీటిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ కోరారు. జలసౌధలో మంగళవారం జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ అమలుపైనే ప్రధానంగా చర్చ జరిగింది. ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తెచ్చే అంశంతో పాటు ఉప సంఘం నివేదికపై కృష్ణా బోర్డు సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా రజత్ కుమార్ మాట్లాడుతూ.. కృష్ణా పరిధిలో 65 కేంద్రాలు గెజిట్ నోటిఫికేషన్‌లో ఉన్నాయని వివరించారు. నాగార్జున సాగర్‌పై 18, శ్రీశైలంపై 12 కేంద్రాలు ఇవ్వాలని బోర్డు ప్రతిపాదించిందని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను బోర్డు పరిధిలోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరిందని, దీనిపై తాము అభ్యంతరం తెలిపామన్నారు. తమకు విద్యుత్ ఉత్పత్తి చాలా అవసరమని చెప్పామని వెల్లడించారు. ప్రాజెక్టు యాజమాన్య హక్కుల విషయమై న్యాయ సలహా అడిగామని రజత్ కుమార్ వివరించారు.

## తుంగభద్ర డ్యాంకు నిలకడగా వరద



అయిజ, అక్టోబర్ 12:: కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో మోస్తారులో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద నిలకడగా కొనసా గుతోంది. మంగళవారం డ్యాంలోకి ఇన్‌ఫ్లో 14,009 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 13,698 క్యూసెక్కులు ఉంది. 100.855 టీఎంసీల సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 100.855 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల నీటి మట్టానికి గాను, ప్రస్తుతం 1633.00 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు కార్యదర్శి నాగమోహన్, సెక్షన్ అధికారి విశ్వనాథ్ తెలిపారు.

ఆర్డీఎస్ ఆనకట్టకు ..

కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద కొనసాగుతున్నది. ఎగువన మోస్తారులో వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు చేరుతోంది. మంగళవారం ఆన కట్టకు 41,318 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా, 40,850 క్యూసెక్కుల వరద నీరు ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోందని కర్ణాటక ఆర్డీఎస్ ఏఈ డేవిడ్ తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 10.7 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 468 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## దేవరుప్పులలో ఉచిత వైద్య శిబిరం.. ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ, అక్టోబర్ 12:: రాష్ట్రంలోని దేవరుప్పుల గ్రామంలో అమెరికా అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ సంస్థ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది.

దీన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు.

ఉపాధి, ఉన్నత అవకాశాల కోసం ఉన్న ఊరును, కన్న తల్లిని వదలి వెళ్లిన డాక్టర్లు తమ రుణం తీర్చుకోవడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశారని కొనియాడారు.

అమెరికాలో భారతీయ మూలాలు ఉన్న డాక్టర్లంతా కలిసి అమెరికా అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ ఏర్పడ్డారు. మన దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు అయిన సందర్భంగా, దేశంలోని 75 గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఈ బృందం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అందులో జనగామ జిల్లాలోని దేవరుప్పుల, చిల్పూర్ మండలంలోని రాజవరం గ్రామాలు కూడా ఉన్నాయి.

దేవరుప్పులలో ఈ స్కూల్‌లో చదివిన నాగేంద్ర ప్రసాద్ శాన్ ఫ్రాన్సిస్కో లో కాన్సూల్ జనరల్‌గా పని చేస్తున్నారు. ఈ శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు జరిపి, అమెరికా వైద్యులతో సంప్రదింపులు చేసి, రోగాలకు అవసరమైన మందులు సిఫారసు చేస్తారు. నేరుగా రోగుల ఫోన్లకే వాట్సాప్ ద్వారా మొత్తం సమాచారం పంపుతారు.

# విపత్తులను ఎదుర్కొనే యంత్రాంగం సదా సిద్ధంగా ఉండాలి

(13 అక్టోబర్ "అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దినం" సందర్భంగా)

ప్రకృతి వైపరీత్యాలు జరుగుతూనే ఉంటాయి. కనీసం శతాబ్దానికి ఒకసారి కరోనా లాంటి మహమ్మారులు చుట్టు ముడుతూనే ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలను ముందు ఊహించడం చాలా సందర్భాలలో వీలు కాదు. మానవ తప్పిదాలతో ప్రాణ ఆస్థినష్టాలు తరుచుగా చూస్తున్నాం. గత ఏడాది విశాఖపట్నం సమీప వెంకటాపురం గ్రామంలో యల్‌జి పాలిమర్స్ పరిశ్రమ నుండి విడుదలైన స్టైరిన్ వాయు లీకేజీ కారణంగా 11 మంది మరణించగా, 1000కి పైగా ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలైనారు. ఈ మానవ నిర్లక్ష్యానికి 3 కిమీ పరిధిలోన ఐదు గ్రామాలు ప్రభావితం కాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారంతో పాటు పునరావాసానికి 30 కోట్లు కేటాయించాల్సి వచ్చింది. ఇలాంటి సహజ/మానవ కారణ విపత్తులు జరిగినపుడు ఆస్థి ప్రాణనష్టాలను తగ్గించే ప్రయత్నాలు చేయడం, ఉపశమన రీతులు తెలుసుకోవడం, క్షతగాత్రులను రక్షించి వైద్యసదుపాయాలు కల్పించడం మరియు విపత్తు ప్రమాద నిర్వహణలో సుశిక్షితులు సత్వరమే స్పందించడం మాత్రమే మన అదీనంలో ఉంటుంది. 2011లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన 302 విపత్తుల్లో 80,000 మరణాలు మరియు 206 మిలియన్ల ప్రజలు ప్రభావితం అయినారు. ఈ విపత్తులు మిగిల్చిన నష్టం 2 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. సహజ (నాచురల్) మరియు మానవ కారణ (మ్యాన్ మేడ్) విపత్తులు జరిగినపుడు వెంటనే స్పందిస్తూ తీసుకోవలసిన చర్యలను, నష్ట నివారణ పద్దతులు మరియు విపత్తు నిర్వహణ గూర్చి కనీస పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రతి ఏటా ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో ప్రపంచ దేశాల్లో 13 అక్టోబర్‌న "అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దినం" పాటించడం జరుగుతోంది. 1989 ఐరాస పిలుపు మేరకు విపత్తుల తీవ్రతను తగ్గించడం (మిటిగేషన్), నివారణ (ప్రివెన్షన్), స్పందన (రెస్పాన్స్), ధైర్యాన్ని నూరి పోయడం (రిఅష్యురెన్స్), తిరిగి యథాస్థితికి తీసుకురావడం (రికవరీ) మరియు ఎదుర్కొనే సంసిద్ధత (ప్రిపరేషన్) లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని విపత్తు ప్రమాద నియంత్రణ మార్గాలను శోధించే వేదికగా అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దినాన్ని తీసుకోవాలని సూచించారు.

ప్రకృతి వైపరీత్యాలలో భూకంపాలు, వరదలు, తుఫానులు, సునామీలు, సూక్ష్మ మహమ్మారి కల్లోలాలు, జునోటిక్ వ్యాధులు, వడగాలులు, మంచు తుఫానులు, ఇసుక తుఫానులు, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు, అసాధారణ సముద్ర అలలు, నేల కోతలు, కరువులు, మంటలు, రేడియోధార్మిక వాయువుల వ్యాప్తి, హిమపాతాలు, కొండచరియలు విరిగి పడడం లాంటివి వస్తాయి. మానవ కారణ విపత్తుల్లో భోపాల్ వాయు దుర్ఘటన లాంటివి, సముద్రజలాల్లో పెట్రోలియం లీకేజ్, చెర్నోబిల్ అణు విస్ఫోటనం, భూతాపంతో మంచుకొండలు కరగటం లాంటివి వస్తాయి. వైపరీత్యాల తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు ప్రాణ నష్టం వేలల్లో, గాయపడిన వారు లక్షల్లో, ఆస్థి నష్టం కోట్లల్లో ఉంటుంది. విపత్తు నిర్వహణలో ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రధానమైంది. క్షతగాత్రులకు సత్వర వైద్య సదుపాయాల కల్పన, నిరాశ్రయులకు తాత్కాలిక శిబిరాల ఏర్పాటు, జంతువుల పరిరక్షణ, ఆస్థులను కాపాడుతూ నష్టాన్ని తగ్గించడం, అత్యవసర సరుకుల రవాణ వ్యవస్థలను నెలకొల్పడం లాంటి చర్యలను తీసుకోవాలి. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో విపత్తులను ముందుగానే పసిగట్టగలిగితే నష్టాలను తగ్గించే అవకాశం చాలా ఉంటుంది. విపత్తు ప్రమాద నిర్వహణలో ఉద్యోగులకు మరియు పట్టభద్రులకు కనీస శిక్షణ ఇవ్వడం తప్పకుండా చేయాలి. దీని కోసం దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు విపత్తు నిర్వహణ శిక్షణ సంస్థలను నెలకొల్పాలి.

నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న కరోనా మహమ్మారి విజృంభన కూడా ఊహించకుండా వచ్చిన ప్రమాదకర విశ్వ విపత్తు మాత్రమే అని భావించాలి. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 విపత్తులో ఇప్పటి వరకు 21.9 కోట్ల కరోనా కేసులు, 45.5 లక్షల మరణాలు జరగడం చూశాం. నేటికి భారత్‌లో కరోనా విపత్తుతో 3.4 కోట్ల కేసులు, 4.51 లక్షల మరణాలు జరిగాయి. కోవిడ్-19 కల్లోలం లోంచి బయట పడడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు తమ కర్తవ్యాలను నిష్టతో నిర్వహిస్తేనే, విశ్వ మానవాళి క్షేమంగా బయట పడగలుగుతుంది. విపత్తు ప్రమాద నిర్వహణలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, స్థానిక యంత్రాంగాలు, రాజకీయ పట్టుదల, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం, శాస్త్రసాంకేతిక సంస్థలు ఎల్లవేళల సిద్ధంగా ఉండాలి. విశ్వమహమ్మారులైన సూక్ష్మజీవుల విజృంభన, వాతావరణ ప్రతికూలతలు, ప్రకృతి వైపరీత్యాలు, మానవ కారణ ప్రమాదాలు జరిగినపుడు సత్వర పౌర స్పందనతో అపార ప్రాణ ఆస్థి నష్టాన్ని తగ్గించవచ్చు. అగ్ని ప్రమాదాలు, తుఫాన్లు, సునామీల, భూకంపాలు లాంటి విపత్తులు జరిగినపుడు మానవ మరియు జంతు ప్రాణనష్టం, ఆస్థి ధ్వంసం, ప్రకృతి వినాశనం పెద్ద ఎత్తున స్వల్ప వ్యవధిలోనే జరిగిపోతుంది.

విపత్తు ప్రమాద నివారణకు తీసుకోవలసిన చర్యల్లో విపత్తును తగ్గించే అవగాహన, ముందస్తు హెచ్చరికలు, విపత్తును ఎదుర్కొనే తయారీ ప్రణాళికలు, రికవరీ మరియు జీవనోపాధికి చేయూత లాంటి చర్యలతో విపత్తు ప్రమాదాలను తగ్గించవచ్చు. ఇండియాకు ఒక ప్రత్యేకమైన 'జాతీయ విపత్తు నియంత్రణ ప్రణాళిక' ఉండాలని, దానిని 2016లో రూపొందించిన ఘనత ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికే దక్కింది. దీనిలో భాగంగా ప్రత్యేకమైన 'జాతీయ విపత్తు స్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)' సహాయం తీసుకోవడం జరిగుతోంది. విపత్తు ప్రమాద అవగాహన, విపత్తు ప్రమాద నిర్వహణ, పర్యవేక్షణ యంత్రాంగం, విపత్తు నష్టాన్ని తగ్గించడానికి పెట్టుబడులు మరియు విపత్తును ఏదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటూ ముందస్తు హెచ్చరికలు చేయడం అనే నాలుగు సూత్రాల మీద భారత విపత్తు నిర్వహణ ప్రణాళికను అభివృద్ధి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు జరగకూడదని, జరిగినా ముందస్తు హెచ్చరికలతో తక్షణమే జరిగబోయే అపార నష్టాన్ని తగ్గించగల విపత్తు నిర్వహణ యంత్రాంగంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యులు కావడానికి సంసిద్ధంగా ఉందాం. సహజ విపత్తుల పట్ల జాగ్రత్త ఉంటూనే మానవ తప్పిదాలతో జరుగనున్న విపత్తులను తప్పిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## బతుకునిచ్చిన అమ్మ బతుకమ్మ......!

-రాష్ట్ర శాసనమండలి ప్రో టైమ్ చైర్మన్ వి. భూపాల్ రెడ్డి.



సంగారెడ్డి, అక్టోబర్ 12(నేటినిజం ప్రతినిధి) రాష్ట్ర వ్యాప్తంగా ఆడపడుచులు అత్యంత ఇష్టంగా జరుపుకునే వేడుక బతుకమ్మ పండుగని రాష్ట్ర శాసన మండలి ప్రో టైమ్ చైర్మన్ భూపాల్ రెడ్డి పేర్కొన్నారు.

సోమవారం జిల్లా ప్రజా పరిషత్ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ పండుగ అన్నారు. తీరొక్క పూలతో పూజించే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగ గా జరుపుకుంటున్నా మన్నారు. మహిళల మనసెరిగి చీర సారేలతో పండుగ జరుపుకునేలా ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు.

పూలను దేవతగా పూజించే సంస్కృతి తెలంగాణ ప్రజలదని, గౌరీ దేవిని బతుకమ్మగా కొలుస్తూ ఆరాధించే తెలంగాణ ఆడపడుచులు అందరూ సుఖ సంతోషాలతో పండుగ వేడుకలను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మహిళలు తంగేడు, గునుగు ,బంతి ,చామంతి ,మందార, పట్టుకుచ్చు, గడ్డిపూలు, పోక పూలు, కట్ల పూలు, రుద్రాక్ష తదితర పూలతో అందమైన బతుకమ్మలకు పేర్చి పూజించి ఆటపాటలతో కొలిచారు.

ఈ కార్యక్రమంలో ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ రాజర్షి షా, జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, ఇతర మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా అధికారులు సిబ్బంది పట్టణంలోని మహిళలు పాల్గొన్నారు.

## భారత-చైనాల 13వ సీనియర్ కమాండర్ల స్థాయి సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:భారత-చైనా కార్ప్స్ కమాండర్ స్థాయి13వ రౌండ్ సమావేశం అక్టోబర్ 10వ తేదీన చుషల్-మోల్డో బోర్డర్ మీటింగ్ పాయింట్‌లో జరిగింది. తూర్పు లడఖ్‌లోని ఎల్ఏసీ ప్రాంతంలో మిగిలి ఉన్న వివిధ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తూ ఈ సమావేశంలో ఇరుపక్షాల మధ్య చర్చలు జరిగాయి. ఎల్ఏసీ వెంట ఉన్న పరిస్థితి చైనా పరిస్థితి మారిపోవడానికి కారణః చైనా ద్వైపాక్షిక ఒప్పందాలను ఉల్లంఘించి ఏక పక్షంగా ప్రయత్నించడం వల్ల ఏర్పడిందని భారతదేశం ఈ సందర్భంగా తేల్చి చెప్పింది.

ఎల్ఏసీ పశ్చిమ సెక్టర్ వెంట శాంతి మరియు ప్రశాంతతను పునరుద్ధరించడానికి చైనీస్ వైపు మిగిలిన ప్రాంతాలలోనూ తగిన చర్యలు తీసుకోవడం అవసరం అని భారత్ పేర్కొంది. ఇది ఇటీవల దుషాన్‌బేలో ఇరు దేశాల విదేశాంగ శాఖ మంత్రులు తమ మీటింగ్‌లో అందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగింది.

అక్కడ మిగిలిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఇరుపక్షాల వారు అంగీకరించారు. ద్వైపాక్షిక సంబంధాలలో పురోగతిని సులభతరం చేయడానికి మిగిలిన ప్రాంతాల సమస్యల పరిష్కరించాల్సిన ఆవశ్యకతను భారతదేశం ఈ సందర్భంగా నొక్కి చెప్పింది. సమావేశంలో, మిగిలిన ప్రాంతాల సమస్యలనున పరిష్కరించడానికి భారతదేశం నిర్మాణాత్మక సూచనలు చేసింది,

కానీ చైనా వీటికి తన ఆమోదం తెలపలేదు. దీనికి తోడు ఎలాంటి ప్రతిపాదనలను కూడా అందించలేకపోయింది. ఈ సమావేశంలో మిగిలిన ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగలేదు. దీనికి తోడు కమ్యూనికేషన్లను నిర్వహించడానికి, క్షేత్ర స్థాయిలో స్థిరత్వాన్ని నిర్వహించడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించాయి.

ద్వైపాక్షిక సంబంధాల దృక్పథాన్ని చైనా వైపు పరిగణనలోకి తీసుకోవాలని మరియు ఈ ద్వైపాక్షిక ఒప్పందాలు మరియు ప్రోటోకాల్ లకు పూర్తిగా కట్టుబడి ఉంటూ మిగిలిన సమస్యల పరిష్కారానికి ముందగా కృషి చేస్తుందని భారత పక్షం ఆశిస్తోంది.

## పిల్లలకు కొవాగ్జిన్ టీకా.. అత్యవసర వినియోగానికి అనుమతి..

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:కరోనా కట్టడిలో మరో ముందడుగు పడింది. ఇప్పటి వరకు 18 ఏళ్లు నిండిన వారికి మాత్రమే దేశంలో టీకాలు ఇస్తున్నారు. తర్వలో పిల్లలకు కూడా టీకాలు పంపిణీ చేయనున్నారు. 2 నుంచి 18 సంవత్సరాల పిల్లల కోసం భారత్ బయోటెక్ సంస్థ నిర్వహించింది. కోవాగ్జిన్ టీకాల ట్రయల్స్ పూర్తికావడంతో డేటాను ఇప్పటికే కేంద్రం ఆరోగ్య శాఖకు అందజేసింది. చిన్నారుల టీకా వినియోగానికి సంబంధించి అనుమతి కోసం సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కమిటీ.. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ)కు సిఫార్సు చేసింది. డ్రగ్స్ రెగ్యులేటరీ అనుమతులు వచ్చిన వెంటనే టీకాను పిల్లలకు అందించనున్నారు. 2 ఏళ్ల నుంచి 18 ఏళ్ల పిల్లలకు టీకాను అందించేందుకు కేంద్రం మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది.

## రైతులకు ఉచితంగా 8.20 లక్షల హైబ్రిడ్ సీడ్ మినీ కిట్లు పంపిణీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:దేశంలో 15 రాష్ట్రాలలో గుర్తించిన 343 జిల్లాలలో రైతులకు ఉచితంగా 8.20 లక్షల హైబ్రిడ్ సీడ్ మినీ కిట్లు పంపిణీ చేయడానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ప్రత్యేక పథకానికి రూపకల్పన చేసింది. విత్తన మార్పిడికి దోహద పడే ఈ పథకం వల్ల పంట దిగుబడి పెరిగి ఉత్పత్తితో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుంది. ఈ పథకాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమార్ మధ్యప్రదేశ్ లోని మోరెనా మరియు షియోపూర్ జిల్లాలలో రెండు కోట్ల విలువ చేసే ఆముదం విత్తనాల మినీ కిట్ లను రైతులకు అందించి ప్రారంభించారు.

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద నూనె గింజలు, ఆయిల్ పామ్ పథకం కింద వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. దేశంలో ఆవాలు సాగవుతున్న ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో అధ్యయనం నిర్వహించిన తరువాత ఈ పథకాన్ని రూపొందించామని శ్రీ తోమార్ తెలిపారు. ఈ పథకం కింద రైతులకు ఈ ఏడాది ఉచితంగా ఆవ విత్తనాలను అందిస్తుందని మంత్రి తెలిపారు. హెక్టర్ కు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి ఇచ్చే 8,20,600 విత్తనాలతో మినీ కిట్లను 15 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 343 జిలాల్లో పంపిణీ చేయడానికి మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమం మధ్యప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, జమ్మూ ఒ కాశ్మీర్, జార్ఖండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ మరియు త్రిపుర వంటి అన్ని ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల యొక్క వివిధ జిల్లాలను కవర్ చేస్తుంది. రూ. ఈ కార్యక్రమం కోసం 1066.78 లక్షలు కేటాయించారు.

ఈ కార్యక్రమం మధ్యప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, జమ్మూ ఒ కాశ్మీర్, జార్ఖండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ మరియు త్రిపుర వంటి అన్ని ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల్లో అమలు జరుగుతుంది . ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం 1066.78 లక్షల రూపాయలను కేటాయించింది.

కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా మధ్యప్రదేశ్ లోని మోరెనా, షియోపూర్, హర్యానాలోని హిసార్, ఉత్తరప్రదేశ్ లోని ఎటా మరియు వారణాసి జిల్లాల్లో ఈ ఏడాది అమలు చేస్తారు. అయిదు రాష్ట్రాలలోని ఏడు జిలాల్లో పంపిణీ చేయడానికి 1615 క్వింటాళ్ల తో 1,20,000 మినీ కిట్లను సిద్ధం చేస్తున్నారు. ప్రతి జిల్లాకు 15 నుంచి 20 వేల వరకు మినీ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుంది. ఎక్కువ దిగుబడి ఇచ్చే మూడు రకాల విత్తనాలను అందిస్తారు. జేకే -6502, ఛాంపియన్, డాన్ రకాల విత్తనాలను దీనికోసం ఎంపిక చేశారు. ఎక్కువ దిగుబడిని ఇచ్చే విత్తనాల వినియోగాన్ని ఎక్కువ చేసి ఉత్పత్తిని పెంచాలన్న లక్ష్యంతో పథకానికి రూపకల్పన చేశారు. పైలట్ ప్రాజెక్టు అమలు జరుగుతున్న తీరును దీనివల్ల కలుగుతున్న ప్రయోజనాలను గుర్తించి ఎక్కువ మంది రైతులు వీటిని ఉపయోగించడానికి ముందుకు వస్తారని మంత్రి పేర్కొన్నారు.

ఆత్మ నిర్భర్ కృషి ని అమలు చేసి ఆత్మ నిర్భర్ భారత్ సాధనకు వ్యవసాయ శాఖ సహకరిస్తుందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ అగర్వాల్ తెలిపారు. లక్ష్య సాధన కోసం వ్యవసాయ శాఖ తొలిసారిగా ఉచిత విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని ఆయన అన్నారు. శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి శుభా ఠాకూర్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఐక్యరాజ్యసమితివారి యూఎన్ వుమెన్ ఇండియాతో కలిసి అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించిన ఎన్ఇజిడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జాతీయ ఇ- గవర్నెన్స్ డివిజన్ ( ఎన్ ఇ జిడి), ఐక్యరాజ్యసమితి వారి వుమెన్ ఇండియా సంస్థలు కలిసి వెబినార్ నిర్వహించాయి. మహిళలు, బాలికల విషయంలో సైబర్ భద్రత అనే అంశంపైన ఈ వెబినార్ నిర్వహించారు. సైబర్ భద్రత విషయంలో అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించారు. జాతీయ సైబర్ భద్రతా చైతన్య మాసోత్సవాల నేపథ్యంలో ఈ కార్యక్రమం జరగడం గమనార్హం. దీంతో ఎన్ ఇ జిడి, యుఎన్ వుమెన్ ఇండియా సంయుక్తంగా చేపట్టబోయే పలు కార్యక్రమాలకు నాంది పడింది. ఈ రెండు సంస్థలు కలసి విస్తృత పరిధిలో భారతదేశ డిజిటల్ కలలు, సైబర్ భద్రత అనే అంశంపైన ఈ కార్యక్రమాలను రూపొందిస్తున్నాయి. వీటిద్వారా మహిళలకు, బాలికలకు సమానమైన, భద్రమైన ఆన్ లైన్ స్పేస్ దొరికేలా చైతన్యం పెంచుతారు. పెరిగిన సైబర్ నేరాలు, హింసపైన తాజాగా నిర్వహించిన వెబినార్ దృష్టిపెట్టింది. మహిళలు, బాలికలకు సమానమైన, భద్రమైన ఆన్ లైన్ స్పేస్ లభించేలా ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఈ వెబినార్ ద్వారా నిర్వాహకులు చాటారు. ఈ సందర్భంగా ఎన్ ఇ జిడి పి అండ్ సిఇవో, మైగవ్ సిఇవో, డిజిటల్ ఇండియా సిఇవో అండ్ ఎండీ అయిన శ్రీ అభిషేక్ సింగ్ ప్రధాన ప్రసంగం చేశారు. ఆధునిక సైబర్ భ్రదతపై తగిన చైతన్యం కలిగి వుండడం ఎంత అవసరమో ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు. దేశంలో పౌరులందరూ డిజిటల్ స్మార్ట్ గా వుండాలని, తద్వారా సైబర్ నేరాలు, దోపిడీ, హింస బారిన పడకుండా వుంటారని అన్నారు. ఇందుకోసం ప్రజల్లో చైతన్యం తేవడానికిగాను కేంద్రప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన వివరించారు. సమాచార సాంకేతికతకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో తీసుకొచ్చిన నియమ నిబంధనల కారణంగా సోషల్ మీడియాను అదుపు చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరి హక్కులను రక్షించడం జరుగుతుందని ఆయన అన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలకు మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా యుఎన్ వుమెన్స్ ఇండియా ప్రతినిధి మిస్ సుసాన్ ఫెర్గూసన్ మాట్లాడారు. భారతదేశంలో ఐక్యరాజ్యసమితి భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. వాటిద్వారా బాలికలు, మహిళలకు చేకూరుతున్న ప్రయోజనాలను తెలిపారు. మహిళలు, బాలికలపై సైబర్ నేరాల ప్రభావం, సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి ఏం చేయాలి తదితర అంశాలపై నిపుణులు మాట్లాడారు. ఈ వెబినార్‌లో మాట్లాడిన మిస్ బృందా భండారి సైబర్ నేరాల విషయంలో బాధితులు ఎలా స్పందించాలో తెలియజేశారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత మంత్రిత్వశాఖకు చెందిన సీనియర్ డైరెక్టర్ శ్రీ రాకేష్ మహేశ్వరి మాట్లాడుతూ సైబర్ భద్రతలోని న్యాయపరైమన, సాంకేతికపరమైన అంశాలను వివరించారు. ఈ ఏడాది నవంబర్ 25నుంచి ఐటీ నియమాలు 2021పైన భారీ ఎత్తున ప్రచారం జరుగుతుందని ఆయన ప్రకటించారు. ప్రజలందరికీ అర్థమయ్యేలా ఈ ప్రచారాన్ని రూపొందించామని తద్వారా సైబర్ నేరాలపైన అవగాహన పెరుగుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ నెలంతా సైబర్ భద్రతపైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతీయ సైబర్ భ్రదతా చైతన్య మాసోత్సవం పేరిట జరుగుతున్న ఈ ఉత్సవాల్లో సైబర్ స్పేస్ విషయంలో చైతన్యం పెంచుతున్నారు. ఈ విషయంలో వ్యక్తుల, సంస్థలు పోషించాల్సిన పాత్ర ఏంటో తెలియజేస్తున్నారు. సైబర్ భ్రదత విషయంలో అమలు చేయాల్సిన నియమ నిబంధనలపై తగిన సమాచారం అందించడంలో ఈ వెబినారు విజయవంతమైందని నిర్వాహకులు తెలియజేశారు. సైబర్ నేరాలపైన ఫిర్యాదులు చేయడంపైనా, లింగవివక్షతతోకూడిన సైబర్ హింసపైనా తగిన చైతన్యం పెంచడం జరిగిందని అన్నారు.

## శ్రీవారి సేవలో సీఎం.. జగన్ సమక్షంలో రైతు సాధికార సంస్థతో ఒప్పందం




తిరుమల, అక్టోబర్ 12: తిరుమల శ్రీవారిని సీఎం జగన్ దర్శించుకున్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న సీఎం జగన్‌కు మహా ద్వారం వద్ద టీటీడీ చైర్మన్, ఈఓలు స్వాగతం పలికారు. సీఎం జగన్ శ్రీవారి ధ్వజ స్తంభాన్ని నమస్కరిస్తూ ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారికి బియ్యంతో తులాభారం మొక్కులు సమర్పించారు. సీఎం జగన్‌కు అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలను అందచేశారు.

శ్రీవారి దర్శనం అనంతరం సీఎం జగన్.. శ్రీవేంకటేశ్వర భక్తి చానల్‌కు సంబంధించి.. కన్నడ, హిందీ చానళ్లను ప్రారంభించారు. తిరుమలలో రూ.10 కోట్లతో నూతనంగా నిర్మించిన బూందీపోటు భవనాన్ని సీఎం జగన్ ప్రారంభించారు. తర్వాత అన్నమయ్య భవన్‌లో రైతు సాధికార సంస్థ, టీటీడీ మధ్య జరిగే ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం జగన్ సమక్షంలో టీటీడీ, రైతు సాధికార సంస్థ మధ్య ఎంవోయూ కుదిరింది. అనంతరం రెండు రోజుల తిరుమల పర్యటన ముగించుకొని రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లారు.

## ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి...!

- అదనపు కలెక్టర్ రాజర్షి షా.



సంగారెడ్డి, అక్టోబర్ 12(నేటినిజం ప్రతినిధి) జిల్లాలో ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు.

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరపు పరీక్షల నిర్వహణపై ఆయన తన చాంబర్ లో సంబంధిత అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 25 నుండి నవంబర్ 3 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించడానికి ఆయా శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

పరీక్షల నిర్వహణకు అవసరమైన ఇన్విజిలేటర్లను, సిట్టింగ్,ఫ్లయింగ్ స్క్వాడ్స్ ను ఏర్పాటు చేయాలని సూచించారు.

పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల లో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ట్రాన్స్కో అధికారులకు సూచించారు. స్టోరేజ్ పాయింట్స్ కు ప్రశ్నాపత్రాలు చేర్చడానికి క్లోజ్డ్ వాహనాలను ఏర్పాటు చేయాలని ఆర్ టి ఏ అధికారులకు సూచించారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులకు ఆదేశించారు.

ప్రతి పరీక్షా కేంద్రంలో ఒక ఏ ఎన్ ఎం ను ఫస్ట్ ఎయిడ్ బాక్స్, మాస్కులు, శానిటైజర్, ఫీవర్ స్కానర్ తో సిద్ధంగా ఉంచాలనీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షా సమయానికి కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఆయా అధికారులందరు సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.

జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి గోవింద రామ్ తెలిపారు. పరీక్షలు అక్టోబర్ 25 నుండి నవంబర్ 3 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12:00 గంటల వరకు ఉంటుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 16,255 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన వివరించారు.

ఈ సమావేశంలో పోలీస్, విద్యాశాఖ , డిఎంఅండ్హెచ్ఓ, ఆర్టిఏ, టి ఎస్ ఆర్ టి సి, ట్రాన్స్కో, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సంక్షోభం.. బొగ్గు సరఫరా వేగవంతం చేసిన రైల్వే

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: దేశవ్యాప్తంగా విద్యుత్ ప్లాంట్లు బొగ్గు కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో భారతీయ రైల్వే మరో కీలక బాధ్యతను తలకెత్తుకున్నది. కరోనా సమయంలో ఆక్సిజన్ సరఫరా చేసిన రైల్వేశాఖ.. ఈ సారి విద్యుత్ సంక్షోభం నుంచి గట్టెకించేందుకు బొగ్గు సరఫరా చేసే బాధ్యతను స్వీకరించింది. బోర్డు సూచనల మేరకు వేగంగా విద్యుత్ థర్మల్ ప్లాంట్లకు బొగ్గును రవాణా ప్రారంభించింది. ఈ విషయంలో రైల్వేలోని అధికారులంతా చురుగ్గా ఉండాలని, గంట గంటకు సమాచారాన్ని సిద్ధం చేయాలని ఆదేశించింది. విద్యుత్, కోల్ మినిస్ట్రీ మంత్రిత్వశాఖలతో జరిగిన చర్చల్లో రైల్వే రవాణా సామర్థ్యంపై విశ్వాసం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పవర్ హౌస్‌ల అవసరాలకు అనుగుణంగా బొగ్గును తరలించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రస్తుతం బొగ్గు కొరతను అంతర్గత అత్యయిక పరిస్థితిగా రైల్వే పరిగణిస్తోంది. దీంతో విద్యుత్ ప్లాంట్లకు తరలించేందుకు 24 గంటలు వ్యాగను నింపుతున్నారు. బొగ్గు కొరతను అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన రైల్వే.. అన్ని జోనల్ రైల్వేల ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్లకు కంట్రోల్ రూమ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించింది. దీంతో పాటు జీఎం, మంత్రిత్వశాఖ అధికారుల కోసం గంటకో బులిటెన్ సిద్ధం చేయాలని కోరింది. బొగ్గు సరఫరాకు సంబంధించి రైల్వే నుంచి వ్యాగన్లు, రేకుల కొరత లేదని మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. సంక్షోభ సమయంలో బొగ్గు రవాణాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నాయి.

రైల్వేలో 850 రేకులు ఉండగా.. బొగ్గు, విద్యుత్ మంత్రిత్వ శాఖ నుంచి మరిన్ని రేకులకు డిమాండ్ ఉండగా.. ఈ మేరకు ఇస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రైల్వే 435 రేకులతో రోజుకు 4000 టన్నుల బొగ్గును రవాణా చేస్తోంది. గూడ్స్ రైళ్ల సగటు వేగం రెండు సంవత్సరాల క్రితం గంటకు 24 కిలోమీటర్ల నుంచి 46 కి.మీ.కి పెరిగింది. ప్రస్తుతం భారతీయ రైల్వే ప్రతిరోజూ లోడ్ చేయాల్సిన బొగ్గు రేకుల సంఖ్యను 430 నుంచి 440-450 వరకు పెంచింది. సోమవారం 1.77 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేసింది. రోజుకు 500 రేక్‌లకు డిమాండ్ పెరిగినప్పటికీ, దాన్ని సౌకర్యవంతంగా నిర్వహించడానికి రైల్వే సిద్ధంగా ఉందని మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొన్నాయి. దేశంలోని తూర్పు భాగంలోని బొగ్గు గనుల డిమాండ్ ఉండగా.. ఆయా ప్రాంతాలకు తూర్పు మధ్య రైల్వే సేవలు అందిస్తున్నది.

# దేశ వ్యాప్తంగా బొగ్గు సంక్షోభం.. 115 కేంద్రాల్లో అడుగంటిన నిల్వలు



హైదరాబాద్ , అక్టోబర్ 12:దేశ వ్యాప్తంగా బొగ్గు సంక్షోభం.. 115 కేంద్రాల్లో అడుగంటిన నిల్వలుదేశంలో విద్యుత్ సంక్షోభం రాబోతోందా.. అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితులు విద్యుత్ సంక్షోభానికి దారి తీసేలా ఉన్నాయి. దేశంలో మొత్తం 135 విద్యుత్ కేంద్రాలు ఉంటే ప్రస్తుతం 115 కేంద్రాల్లో బొగ్గు నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సగటున మరో నాలుగైదు రోజుల్లో నిల్వలు దాదాపుగా అయిపోయే పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా 17 కేంద్రాల్లో కనీసం ఒక రోజుకు సరిపోయే బొగ్గు నిల్వలు లేవు.

26 కేంద్రాల్లో ఒక రోజుకు, 22 థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో రెండు రోజులకు, 18 విద్యుత్ కేంద్రాల్లో 3 రోజులకు, 13 విద్యుత్ కేంద్రాల్లో నాలుగు రోజులకు సరిపడే బొగ్గు మాత్రమే ఉంది. ఉత్తర భారత దేశంలోని 33 థర్మల్ విద్యుత్ కేంద్రాలు తీవ్రమైన బొగ్గు కొరతను ఎదర్కొంటోంది. హర్యానా, రాజస్థాన్, పంజాబ్, ఢిల్లీలపై బొగ్గు కొరత ప్రభావం పడనుందని సెంట్రల్ ఎలక్ట్రిక్ అథారిటీ తెలిపింది. బొగ్గు, విద్యుత్ సంక్షోభంపై సోమవారం కేంద్ర హోంమంత్రి, విద్యుత్, కోల్ మినిస్టర్లతో సమావేశమై అధికారులతో సమీక్షించారు.

# మెడికల్ కాలేజీకి అడ్డుపడితే ద్రోహులుగా మిగిలిపోతారు : మంత్రి సత్యవతి




మహబూబాబాద్, అక్టోబర్ 12:: జిల్లాలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం కేసీఆర్ ఇచ్చిన మెడికల్ కాలేజికి అడ్డుపడే ప్రయత్నం చేస్తే వారు జిల్లా ద్రోహులుగా మిగిలిపోతారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

మెడికల్ కాలేజి కోసం ఎంపిక చేసిన స్థలంలో అర్హులైన పేదలు నష్టపోతే వారికి ఖచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ జిల్లా అభివృద్ధిలో జిల్లా నాయకత్వం అంతా కలిసి పని చేస్తుందని తెలిపారు.

జిల్లా దవాఖానలో దాదాపు 2 కోట్ల రూపాయల విలువైన ఆక్సిజన్ ప్లాంట్ను మంత్రిమంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఈరోజు మంచి రోజు. మన జిల్లాలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.

మిషన్ సంజీవని పేరుతో ఆక్స్ ఫామ్ ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా ప్లాంట్ లు ఏర్పాటు చేస్తూ మనదగ్గర కూడా 1.40 కోట్ల రూపాయల విలువైన ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్ ఇచ్చినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

మహబూబాబాద్ హాస్పిటల్ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ములుగు, జయశంకర్ జిల్లా, తొర్రురులో కూడా వైద్య సదుపాయాలు, హాస్పిటల్ కోసం ఆక్స్ ఫామ్ సంస్థ నిధులు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ కాలేజీ వల్ల ఎవరికి అన్యాయం జరుగకుండా ప్రభుత్వ పరంగా దుకుంటామన్నారు.

మంత్రితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ కుమారి బిందు, ఎంపీ కవిత, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రాములు, ఆక్స్ ఫామ్ సంస్థ ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

# జోగులాంబకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి నిరంజన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 12దేవీ నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలంపూర్ జోగులాంబ ఆలయాలను మంత్రి నిరంజన్ రెడ్డి, ఎంపీ రాములు, జడ్పీ చైర్పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం దర్శించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున ఆలయాలకు మంత్రి నిరంజన్ రెడ్డి పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



# గ్రీన్ హౌస్ వాయువుల నియంత్రణలో పట్టణ పథకాల పాత్ర కీలకం!



న్యూఢిల్లీ, అక్టోబర్ 12: సుస్థిరమైన పట్టణాభివృద్ధి విషయంలో ప్రజలను అగ్రభాగాన నిలిపేందుకు గృహనిర్మాణంతోపాటుగా, పలు రకాల కార్యకలాపాల్లో కర్బన కాలుష్యాన్ని నివారించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలు, పెట్రోలియం, ఖనిజవాయువు శాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరి పిలుపునిచ్చారు. అందరికీ గృహవసతి, సేవల బట్వాడా, మెరుగైన రవాణా సదుపాయాలు అందాలంటే కర్బన వాయువుల కాలుష్యాన్ని నియంత్రించడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఆవాస దినోత్సవం సదర్భంగా "కర్బన కాలుష్యానికి తావియ్యని ప్రపంచం కోసం పట్టణ కార్యకలాపాలను సత్వర పరచడం'' అనే ఇతివృత్తంపై ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అక్టోబరు 11న జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల కార్యదర్శి దుర్గా శంకర్ మిశ్రా, అదనపు కార్యదర్శి సురేంద్ర కుమార్ బాగ్డే, ఐక్యరాజ్యసమితి ఏజెన్సీల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల అధికారులు, కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

వాతావరణంలో ఎదురయ్యే పెనుమార్పులను ఎదుర్కొనడంలో మోదీ ప్రభుత్వం చూపిన చొరవన, సామర్థ్యం అభినందనీయమని కేంద్రమంత్రి హరదీప్ సింగ్ పూరి అన్నారు. దేశంలో దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధికి మోదీ ప్రభుత్వం పునాదులు వేసిందని అన్నారు. ఈ రోజున భారీ ఎత్తున సాగుతున్న పట్టణీకరణను, వాతావరణ మార్పులను తట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించినపుడు తమ ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని ఆయన అన్నారు.

"కర్బన కాలుష్యానికి తావియ్యని ప్రపంచం కోసం పట్టణ కార్యకలాపాల వేగిరవరచడం'' అనే ఇతివృత్తం భారతదేశానికి ఎంతో అనుసరణీయమైనదని కేంద్రమంత్రి పూరి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పట్టణ వాతావరణం పెరగడం తో నగరాల్లో ఇంధనానికి డిమాండ్ కూడా పెరిగిపోతోందని, ప్రపంచ వ్యాప్తంగా 78శాతం ఇంధన వినియోగానికి, 70శాతం మేర కర్బన ఉద్గారాల కాలుష్యం వ్యాప్తికి (జి.హెచ్.జి.కి) ఈ నగరాలే కారణమవుతున్నాయని ఆయన అన్నారు. వాతావరణంలో సంభవించే పెనుమార్పులతో మానవ ఆవాసాలు ప్రమాదాలకు ఆలవాలంగా మారాయని, ప్రత్యేకించి మరీ నిరుపేదలు, పేదరికంలో మగ్గిపోయే పట్టణవాసులు ఈ విషమ పరిస్థితిని ఎక్కువగా ఎదుర్కొంటున్నారని, వాతావరణ ప్రతికూలతకు వీరే ఎక్కువ దెబ్బతింటున్నారని మంత్రి అన్నారు. 2019వ సవత్సరంలో వాతావరణ మార్పులతో ఎక్కువ ప్రభావితమైన దేశాల్లో భారతదేశం 7వ స్థానంలో ఉందని, దేశంలోని నగరాలపైనే ఈ ప్రభావం ఎక్కువగా పడిందని చెప్పారు.

భారతీయ నగరాల ఆర్థిక, పర్యావరణ అనివార్యతల గురించి మంత్రి మాట్లాడుతూ,..అభివృద్ధి చెందిన ఇతర దేశాలతో పోల్చినపుడు, భారతదేశంలో తలసరి కర్బన కాలుష్య వాయువుల, గ్రీన్ హౌస్ వాయువుల విడుదల చాలా తక్కువ పరిమాణంలో ఉందన్నారు. 1870నుంచి 2017వరకూ భారతదేశంలో వెలువడిన కార్బన్ డయాక్సైడ్ అతి తక్కువగా అంటే,.. 3శాతంగా నమోదైందని అమెరికాతో తదితర దేశాలతో పోల్చితే ఇది చాలా తక్కువని మంత్రి అన్నారు. అమెరికాలో 25శాతం, యూరోపియన్ యూనియన్, బ్రిటన్ దేశాల్లో 22శాతం, చైనాలో 13శాతంగా ఇది నమోదైందని చెప్పారు.

ఆర్థికాభివృద్ధికోసం గతంలో సంపన్నదేశాలు అనుసరించిన పారిశ్రామికీకరణ విధానాన్నే చేపట్టాలని భారతదేశం లక్ష్యంగా పెట్టుకున్నదని, అయితే పర్యావరణపరంగా ఎదురయ్యే నష్టం గురించి తెలుసు కాబట్టి ఆయా దేశాల పంథానే భారతదేశం అనుసరించాల్సిన అవసరం ఏ మాత్రం లేదని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు. నగరాలకు ఉన్న ప్రాధాన్యత ఏమిటో భారతదేశం ఎప్పుడో గుర్తించిందని, ఎందుకంటే, 2030నాటికి జాతీయస్థాయి స్థూల దేశీయ ఉత్పాదన (జి.డి.పి.)లో 70శాతం వాటా నగరాలదే కావచ్చని భావిస్తున్నారని మంత్రి అన్నారు. ఆర్థికవరమైన ఆశలను నెరవేర్చడంతోపాటుగా, పర్యావరణపరంగా కూడా మనం బాధ్యతాయుతంగా వ్యవహరించవలసిన అవసరం ఉందని అన్నారు. దేశంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (ప్రత్యేకించి 11వ, 13వ లక్ష్యాలను) చేరాలంటే, తక్కువ స్థాయి కర్బన కాలుష్యాలను విడుదలచేసే నగరాలే అవసరమనే విషయంలో ఎలాంటి సందేహాలకు ఆస్కారం లేదన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు (ఎస్.డి.జి.లకు) సంబంధించి ప్రపంచ స్థాయి ఫలితాలకు భారతదేశం సేవలు ఎంతో ఆవశ్యకమని అన్నారు.

వాతావరణ మార్పుల ప్రతికూలతలను ఎదుర్కొనేందుకు భారతీయ పట్టణ పథకాలు ఎంతో దోహదపడ్డాయని అన్నారు. స్వచ్ఛ భారత్ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి.ఎం.ఎ.వై.), స్మార్ట్ నగరాల పథకం, పట్టణ రవాణా, మోదీ ప్రభుత్వం ప్రారంభించిన అమృత్ (ఒంఖీజు) పథకం వంటివి, భూతాపోన్నతికి కారణమయ్యే కర్బన కాలుష్య వాయువులను తగ్గించడంలో ఎంతో కీలకపాత్ర పోషించాయన్నారు. పట్టణాల్లో అమలయ్యే ఈ పథకాలన్నీ సమగ్రమైన పట్టణీకరణ కార్యక్రమంలో భాగం కావడమే కాకుండా, వాతావరణ మార్పుల ప్రతికూలతను నియంత్రించే సాధనాలుగా మారాయని కేంద్రమంత్రి అన్నారు.

పి.ఎం.ఎ.వై. పథకం కింద ఇళ్ల నిర్మాణంలో సుస్థిరమైన, ఇంధన సామర్థ్యంతో కూడిన పద్ధతులను పాటిస్తున్నట్టు హరదీప్ సింగ్ పూరి చెప్పారు. పర్యావరణహితంగా నిర్మించే హరిత భవవాల ద్వారా 20నుంచి 30శాతం వరకూ ఇంధన పొదుపును, 30నుంచి 50శాతం నీటి పొదుపును సాధించవచ్చని అన్నారు. ఈ పథకం కింద ప్రస్తుతం నిర్మిస్తున్న156లక్షలకు పైగా ఇళ్ల విషయంలో హరిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్టు చెప్పారు. పి.ఎం.ఎ.వై. కింద ఇళ్ల నిర్మాణం ద్వారా, 2022నాటికి దాదాపు కోటీ 20లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్.కు సమానమైన గ్రీన్ హౌస్ వాయువులను నియంత్రించేందుకు అవకాశం ఉందని అన్నారు. తక్కువ స్థాయి కర్బన కాలుష్యాల విడుదలకు కారణమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకే పి.ఎం.ఎ.వై. పథకం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద వెయ్యేసి ఇళ్లతో కూడిన ఆరు లైట్ హౌస్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నట్టు చెప్పారు.

ఎక్కువమంది జనాభాకు వ్యాక్సినేషన్ అందించిన దేశాల జాబితాలోకి భారతదేశం కూడా చేరబోతోందని, కోవిడ్ నివారణ లక్ష్యంగా త్వరలోనే వందకోట్లమందికి భారతదేశం వ్యాక్సీన్లను అందించబోతోందని కేంద్రమంత్రి హరదీప్ సింగ్ పూరి చెప్పారు. కోవిడ్-19 వైరస్ మహమ్మారి వ్యాప్తితో దెబ్బతిన్న లక్షలాది మంది వీధి వ్యాపారులను స్వానిధి పథకం ద్వారా ఆదుకున్నామన్నారు. దేశంలో పారిశుద్ధ్యంకోసం మహాత్మాగాంధీ కన్న కలలు ఇపుడు పూర్తిగా సాకారమయ్యాయని అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ (అర్బన్) పథకం ద్వారా నగరాలన్నింటినీ బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దామన్నారు. స్వచ్ఛభారత్ పథకం రెండవ దశలో నగరాలన్నీ చెత్త రహితంగా తయారవుతాయన్నారు. ఘనవ్యర్థాల నిర్మూలనా ప్రక్రియ ఇప్పటికే దాదాపు 70శాతం పూర్తయిందని, స్వచ్ఛ భారత్ మిషన్ రెండవ దశలో ఇది వందశాతం ఫలితాలను సాధిస్తుందని కేంద్రమంత్రి అన్నారు.

పట్టణ రవాణా వ్యవస్థపై మంత్రి మాట్లాడుతూ, ప్రజా రవాణా వ్యవస్థను విస్తరింపజేసేందుకు ప్రభుత్వం పలు రకాల చర్యలు తీసుకుంటోందని అన్నారు. మెట్రో రైళ్లు వంటి పటిష్టమైన ప్రజారవాణా వ్యవస్థను తాము విస్తరింపజేస్తామని, ఇప్పటికే దేశంలోని 18 నగరాల్లో 721 కిలోమీటర్ల మార్గంలో మెట్రోరైళ్లు అందుబాటులోకి వచ్చాయని, ప్రస్తుతం 27 నగరాల్లో 1,058 కిలోమీటర్ల మెట్రో రైలు వ్యవస్థ నిర్మాణంలో ఉందని అన్నారు. రహదారులపై సొంత వాహనాల పరుగులతో వెలువడే కర్బనవాయువుల కాలుష్యాన్ని ఈ మెట్రో రైలు వ్యవస్థ ద్వారా అరికట్టవచ్చని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి దుర్గా శంకర్ మిశ్రా స్వాగతోపన్యాసం ఇస్తూ,.. వాతావరణ మార్పుల ప్రతికూల పరిణామాలనుంచి విముక్తి కలిగించే ప్రపంచాన్ని సృష్టించడంలో పట్టణ కేంద్రాలకు ఎంతో కీలకపాత్ర ఉంటుందన్నారు. పల్లెలతో పోల్చుకుంటే నగరాలే ఎక్కువగా ఇంధనంపై ఆధారపడతాయని, పర్యావరణాన్ని ప్రభావితం చేసేది కూడా నగరాలేనని ఆయన అన్నారు. పెరుగుతున్న పట్టణీకరణ కారణంగా ప్రజారవాణాకు, వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలకు గిరాకీ కూడా పెరిగిందని, పట్టణాల్లో ఖాళీ జాగాపై ఒత్తిడి కూడా విపరీతంగా పెరిగిందని ఆయన అన్నారు.

వాతావరణ పెనుమార్పులు, భూతాపోన్నతి కారణంగా ఎదురయ్యే సవాళ్లను గుర్తించిన భారతీయ నగరాలు ఇటీవలి కాలంలో పర్యావరణహితమైన రవాణా ప్రత్యామ్నాయాలవైపు ముందుకు సాగుతుతున్నాయని, నడక, సైక్లింగ్, ప్రజారవాణా వంటి ప్రత్యామ్నాయాలకోసం మన నగరాలు కృషి చేస్తున్నాయని మిశ్రా చెప్పారు. 2021లో జరిగిన వాతావరణ సదస్సు తీర్మానాలకు దేశం కట్టుబడి ఉందని, పునరుత్పాదన ఇంధనం వాటాను పెంచేందుకు, ఇంధన సామర్థ్యాన్ని పెంచుకునేందుకు, నిర్మాణంకోసం స్థానిక సామగ్రిని వినియోగించుకునేందుకు, అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసేందుకు, ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు, వాతావరణ ప్రతికూలతను తట్టుకునే పద్ధతులను పాటించేందుకు దేశం ఎంతో కృషి చేస్తోందని మిశ్రా అన్నారు.

ప్రపంచ ఆవాస దినోత్సవాన్ని పురస్కరించుకుని,.. కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి సంస్థ (హడ్కో), భవననిర్మాణ సామగ్రి, సాంకేతిక పరిజ్ఞాన మండలి (బి.ఎం.టి.పి.సి.), జాతీయ భవన నిర్మాణ సంస్థ (ఎన్.బి.సి.సి.) వెలువరించిన ఎలక్ట్రానిక్ ప్రచురణలను (ఇ-పబ్లికేషన్స్.ను) కూడా ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు.

# జాతీయ మానవహక్కుల సంఘం (ఎన్ హెచ్ఆర్ సి) 28వ స్థాపన దిన కార్యక్రమానికి హాజరైన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్ హెచ్ఆర్ సి) 28వ స్థాపక దిన కార్యక్రమం లో వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా పాలుపంచుకొన్నారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, భారతదేశంలో మానవ హక్కుల తో పాటు, మానవీయ విలువల కు దేశ స్వాతంత్ర్యోద్యమం, దేశ చరిత్ర లు ఒక గొప్ప ప్రేరణ ను అందించాయి అన్నారు. "ఒక దేశం గా, ఒక సమాజం గా మనం అన్యాయాన్ని, అఘాయిత్యాల ను ఎదిరించాం. మన హక్కుల కోసం శతాబ్దాల తరబడి పోరాటం చేశాం. ఎప్పుడైతే యావత్తు ప్రపంచం 1వ ప్రపంచ యుద్ధం తాలూకు హింస బారిన పడిందో ఆ కాలం లో భారతదేశం 'హక్కులు మరియు అహింస' మార్గాన్ని సూచించింది అని ఆయన అన్నారు. మన బాపు ను మానవ హక్కుల ప్రతీక గాను, మానవ విలువల కు ప్రతీక గాను యావత్తు ప్రపంచం భావిస్తున్నది అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రపంచం అనేక సందర్భాల లో అయోమయాని కి లోనై, భ్రమల లో చిక్కుకొందో భారతదేశం మాత్రం మానవ హక్కుల పట్ల అచంచలం గా, సంవేదన శీలం తో ఉ ఒడిందని ప్రధాన మంత్రి అన్నారు.

మానవ హక్కుల భావన అనేది పేదల గౌరవం తో అత్యంత సన్నిహితమైన సంబంధాన్ని కలిగివుందని ప్రధాన మంత్రి అన్నారు. నిరుపేద ప్రజలు ప్రభుత్వ పథకాల లో ఒక సమానమైన వాటా ను పొందలేకపోయినప్పుడు హక్కుల తాలూకు ప్రశ్న ఉదయిస్తుంది అని ఆయన అన్నారు. పేదల గౌరవాని కి పూచీ పడడం కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయాసల ను గురించి ప్రధాన మంత్రి ఒక్కటొక్కటి గా వివరించారు. ఎప్పుడైతే ఒక పేద వ్యక్తి టాయిలెట్ సదుపాయాని కి నోచుకొన్నారో, ఆ వ్యక్తి బహిరంగ ప్రదేశాల లో మల మూత్రాదుల విసర్జన అగత్యాన్నుంచి బయటపడతారు, దానితో ఆ వ్యక్తి కి గౌరవాన్వితుడు అవుతారు అని ప్రధాన మంత్రి అన్నారు. అదే విధం గా ఒక బ్యాంకు లోపలకు వెళ్ళడానికి వెనుకంజ వేసేటటువంటి ఒక పేద మనిషి జన్ ధన్ ఖాతా ను కలిగి ఉంటే ఆ ఖాతా ఆ వ్యక్తి గౌరవానికి పూచీ పడుతుంది అని ప్రధాన మంత్రి అన్నారు. అదే తరహా లో రూపే కార్డు, ఉజ్జ్వల గ్యాస్ కనెక్షన్ లు, పక్కా ఇళ్ళ కు సంబంధించిన సంపత్తి హక్కు లు మహిళ ల పరం కావడం అనేవి ఈ దిశ లో పడినటువంటి ప్రధానమైన అడుగులు అంటూ ఆయన అభివర్ణించారు.

విభిన్న వర్గాల లో వేరు వేరు స్థాయిల లో జరుగుతున్న అన్యాయాన్ని తొలగించడానికి సైతం దేశం గత కొన్నేళ్ళ లో ప్రయత్నించిందని ప్రధాన మంత్రి అన్నారు. "దశాబ్దుల పాటు ముమ్మారు తలాక్ కు వ్యతిరేకం గా ఒక చట్టం కావాలి అంటూ ముస్లిమ్ మహిళ లు పట్టు పట్టుతూ వచ్చారు. ముమ్మారు తలాక్ కు వ్యతిరేకం గా ఒక చట్టాన్ని చేయడం ద్వారా ముస్లిమ్ మహిళల కు మేము కొత్త హక్కుల ను ఇచ్చాం" అని ప్రధాన మంత్రి అన్నారు. మహిళ ల కోసం అనేక రంగాల లో తలుపుల ను తెరవడం జరిగింది. మరి వారు అన్ని సమయాల లో సురక్షత ను కలిగివుంటూ పని చేసేటటువంటి వాతావరణాన్ని కల్పించడం జరిగింది అని ప్రధాన మంత్రి చెప్పారు. వృత్తి జీవనాన్ని గడిపే మహిళ ల కోసం 26 వారాల పాటు వేతనం తో కూడిన మాతృత్వ సెలవు లభించేటట్లు భారతదేశం చూసింది. ఈ ఘనమైన కార్యాన్ని అభివృద్ధి చెందిన దేశాలు సైతం సాధించలేకపోయాయి అని ఆయన అన్నారు. ఇదే మాదిరి గా, ట్రాన్స్-జెండర్స్, బాలలు, సంచార సముదాయాల వారి కోసం తీసుకు వచ్చిన నిర్ణయాల గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు.

ఇటీవల ముగిసిన పారాలింపిక్స్ లో పారా-ఎథ్ లీట్ ల స్ఫూర్తిదాయక ప్రదర్శన ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, దివ్యాంగ జనుల కోసం ఇటీవల కాలం లో చట్టాల కు రూపకల్పన చేయడం జరిగింది అన్నారు. వారికి కొత్త సదుపాయాల ను కల్పించడం జరిగింది. వారి కోసం భవనాల ను నిర్మించడమైంది. దివ్యాంగుల కంటూ ప్రత్యేకం గా ఒక భాష ను ప్రమాణికీకరించడమైంది కూడా అని ఆయన వివరించారు.

మహమ్మారి కాలం లో పేదల కు, అసహాయులైన వర్గాల కు, వయోవృద్ధుల కు ఆర్థిక సహాయాన్ని వారి వారి ఖాతాల లోకే నేరు గా అందించడం జరిగింది అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. 'వన్ నేశన్-వన్ రేషన్ కార్డు' ను అమలు లోకి తీసుకువచ్చినందువల్ల ప్రవాసీ శ్రమికుల కు ఎన్నో ఇబ్బందులు దూరమయ్యాయి అని ఆయన పేర్కొన్నారు.మానవ హక్కుల కు ఏరి కోరి భాష్యం చెప్పకూడదు, అలాగే దేశం ప్రతిష్ట ను మసకబార్చడం కోసమని మానవ హక్కుల ను వినియోగించుకోరాదు అని ప్రధాన మంత్రి హెచ్చరిక చేశారు. ఈ మధ్య కొంత మంది వారి స్వప్రయోజనాల కోసం వారిదైన కోణం లో నుంచి మానవ హక్కుల కు భాష్యాన్ని చెప్పడం మొదలు పెట్టారు అని ప్రధాన మంత్రి అన్నారు. ఏదైనా ఒక ఘటన లో మానవ హక్కుల ఉల్లంఘన ను గమనించే ధోరణి ని వ్యక్తం చేయడం, మరి అలాంటిదే రెండో ఘటన లో వారే వారి మునుపటి ధోరణి ని వ్యక్తం చేయకపోవడం అనేది మానవ హక్కుల కు ఎంతో నష్టాన్ని తెచ్చిపెడుతున్నదని ఆయన అన్నారు. మానవ హక్కుల ను రాజకీయాల పట్టకం లో నుంచి చూసినప్పుడు, వాటిని రాజకీయ లాభ నష్టాల కోణం లో నుంచి చూసినప్పుడు మానవ హక్కుల పరం గా అతి పెద్ద ఉల్లంఘన చోటు చేసుకొంటుంది అని కూడా ఆయన అన్నారు. "ఇలా ఆయా సందర్భాల లో ఎంపిక చేసుకొన్న రీతి న నడచుకోవడం అనేది ప్రజాస్వామ్యాని కి కూడా అంతే సమానమైన మేరకు నష్టాన్ని కొని తెస్తోంది" అంటూ ప్రధాన మంత్రి హెచ్చరిక స్వరాన్ని వినిపించారు.మానవ హక్కు లు కేవలం హక్కుల తోనే సంబంధం కలిగినవి కాక అవి మన బాధ్యతల తో ముడిపడినటువంటివి కూడా ను అని గ్రహించడం ముఖ్యమని ప్రధాన మంత్రి అన్నారు. "హక్కులు, బాధ్యత లు అనేవి రెండు పట్టా లు. ఆ పట్టాల పైనే మానవ అభివృద్ధి, మానవ గౌరవం పయనిస్తాయి. బాధ్యత లు అనేవి హక్కు ల మాదిరిగానే సమానమైన ప్రాముఖ్యాన్ని కలిగివుంటాయి. వాటి ని వేరు వేరు గా చర్చించ కూడదు, అవి ఒకదాని కి మరొకటి పూరకం గా ఉంటాయి" అని ఆయన అన్నారు.రాబోయే తరాల మానవ హక్కుల ను గురించి ప్రస్తావిస్తూ, ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఎ), నవీకరణ యోగ్య శక్తి లక్ష్యాలు, ఇంకా హైడ్రోజన్ మిశన్ ల వంటి చర్యల ను గురించి ఆయన నొక్కి చెపూ స్థిరమైనటువంటి జీవనాన్ని, పర్యావరణాని కి అనుకూలమైన వృద్ధి ని సాధించడం అనే దిశ లో భారతదేశం శరవేగం గా పయనిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు.

# యునైటెడ్ కింగ్ డమ్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్‌తో ప్రధానమంత్రి టెలిఫోన్ సంభాషణ

అమరావతి, అక్టోబర్ 12:యునైటెడ్ కింగ్ డమ్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సోమవారం టెలిఫోన్ లో సంభాషించారు.

ఈ ఏడాది ప్రారంభంలో తమ వర్చువల్ సమావేశం అనంతరం ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిని ఉభయ నాయకులు సమీక్షించారు. తమ వర్చువల్ సమావేశంలో ఆమోదించిన రోడ్ మ్యాప్ 2030 కింద ఇప్పటికే చేపట్టిన చర్యల పట్ల సంతృప్తి ప్రకటించారు. అలాగే వాణిజ్య భాగస్వామ్యం విస్తరణలో సాధించిన పురోగతిని కూడా వారు సమీక్షించి ఉభయ దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి బంధాలను పటిష్ఠం చేసుకునే అవకాశాలున్నాయని అంగీకరించారు.

నవంబర్ నెల ప్రారంభంలో గ్లాస్గోలో జరగబోయే యుఎన్ఎఫ్ సిసిసి-సిఒపి-26 సమావేశాలను దృష్టిలో ఉంచుకుని వాతావరణ మార్పులకు సంబంధించిన అంశాలపై కూడా ఉభయులు విస్తృతంగా చర్చించారు. వాతావరణ కార్యాచరణకు భారతదేశం కట్టుబాటును ప్రధానమంత్రి మరోసారి తెలియచేస్తూ పునరుత్పాదక ఇంధనం విస్తరణకు ఆకాంక్షాపూరిత లక్ష్యాలు, ఇటీవల ప్రకటించిన జాతీయ హైడ్రోజెన్ మిషన్ రెండింటిలోనూ అది ప్రతిబింబిస్తున్నదని ఆయన తెలిపారు.

ప్రాంతీయ పరిణామాలు... ప్రత్యేకించి ఆఫ్ఘన్ లో తాజా పరిస్థితిపై కూడా వారు పరస్పరం అభిప్రాయాలు తెలియచేసుకున్నారు. తీవ్రవాదం, ఉగ్రవాదం; మహిళలు, మైనారిటీల హక్కులు, మానవ హక్కుల విభాగాల్లో ఉమ్మడి అంతర్జాతీయ విధానం రూపొందించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

# శ్రీనగర్‌లో ప్రసార భారతి ఆడిటోరియంను ప్రారంభించిన సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ శ్రీనగర్ ఆల్ ఇండియా రేడియోలోని ప్రసార భారతీ ఆడిటోరియంను ఈ రోజు ప్రారంభించారు. ఈ ప్రాగణంను మొత్తం 170 మంది వీక్షకులకు అనువుగా నిర్మించారు. ప్రత్యేకమైన డిజిటల్ టెక్నాలజీతో దీనిని తీర్చిదిద్దారు. 2014లో ఇక్కడ వచ్చిన వరదల కారణంగా ఈ ఆడిటోరియం దెబ్బతిన్నది. దీనిని ఇప్పుడు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆల్ ఇండియా రేడియో, దూర్‌దర్శన్‌ల పాత్రను కొనియాడారు. ఈ రెండు సంస్థలు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఎంతో నాణ్యమైన కార్యక్రమాలను రూపొందిస్తున్నట్టుగా ఆయన వివరించారు. 2014లో వచ్చిన వరదలు, కోవిడ్-19 మహమ్మారి విస్తరించిన సమయంలో ఆల్ ఇండియా రేడియో (ఏఐఆర్) శ్రీనగర్ శాఖ, దూర్‌దర్శన్ శ్రీనగర్ పోషించిన కీలక పాత్రను ఆయన గుర్తుచేశారు. దేశ సరిహద్దుకు దగ్గరగా ఉన్న ఆల్ ఇండియా రేడియో, దూర్‌దర్శన్ శ్రీనగర్ శాఖలు దేశ వ్యతిరేకంగా మన పొరుగు దేశాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తమతమ కార్యక్రమాల ద్వారా సమర్థంగా తిప్పుకొడుతూ తగిప అవగాహనను కల్పించడంలో కీలక ప్రాతను పోషిస్తున్నట్టుగా తెలిపారు. 370వ ఆర్టికల్‌ను రద్దు చేసిన తరువాత జమ్ము కాశ్మీర్ శాంతి సౌభాగ్యాలతో ప్రగతి పథంలో వేగంగా దూసుకుపోతోందని తెలిపారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ చేపట్టిన సమీకృత అభివృద్ధి, సుపరిపాలనతో పాటుగా స్థానికంగా జమ్ము కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పరిపాలన ఈ ప్రాంతాన్ని గణనీయమైన అభివృద్ధి పథంలో నిలిపుతోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బాగంగా ప్రముఖ కశ్మీరీ కళాకారులు, ప్రముఖ గాయకులు బషీర్ అహ్మద్ త్రైల్బాలీ బృందం గాత్ర కచేరీని ఏర్పాటు చేశారు.

# విద్యార్థులకు బతుకమ్మ దుస్తులు పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి



ములుగు, అక్టోబర్ 12:: శ్రమలో, సంపద సృష్టిలో, సాంస్కృతిక వికాసంలో మహిళల కృషిని తెలిపే పండుగ బతుకమ్మ అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ప్రొ. సురేపల్లి సుజాత తాడ్వాయి జూనియర్ కళాశాల బాలికలకు అందించిన బతుకమ్మ దుస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తాడ్వాయి అరణ్యం జీవ వైవిధ్య కేంద్రమన్నారు.

తనకు తీరొక్క పూలతో స్వాగతము పలికిన విద్యార్థినిలను ఆశీస్సులందించారు. అలాగే అస్నాల శ్రీనివాస్ రాసిన బత్కమ్మ విశిష్ఠతను తెలియచేసే 'తెలంగాణ బతుకు పండుగ' వ్యాసాన్ని ఆవిష్కరించారు. ఇంటర్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

అనేక సేవా సంస్థలు, దాతల ద్వారా తాడ్వాయి ఏజెన్సీలో విద్యా వికాసానికి తోడ్పడుతున్న ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారం పొందిన సందర్భంగా ఘనంగా సన్మానించారు.

సమావేశంలో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి, మార్కెట్ చైర్మన్ రమణయ్య, యువజన నాయకుడు సలేందర్, అధ్యాపకులు రాములు నాయక్, సంధ్య, కిషన్, మూర్తి, రాజు, శ్వేత, రాజ్ కుమార్, శ్రీలత, అశోక్ పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి కదిలిన జిల్లా యంత్రాంగం..!!- జిల్లా కలెక్టర్ హనుమంతరావు.



సంగారెడ్డి, అక్టోబర్ 12 (నేటినిజం ప్రతినిధి) రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకుజిల్లా కలెక్టర్ హనుమంతరావు , అదనపు కలెక్టర్ వీరారెడ్డి , సిబ్బంది తో కలిసి మంగళవారం నాడు ఆందోల్ ,పుల్కల్ మండలాల పరిధిలోని గ్రామాల రైతులకు సంబంధించిన ధరణి భూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తహశీల్దార్ల కార్యాలయంలో కంప్యూటర్ లు ఏర్పాటు చేసి ధరణి జి ఏల్ ఏసీ లో వచ్చిన అర్జీలు,భూముల వివరాలు పరిశీలించారు. పట్టా భూములు ఉన్న రైతుల సమస్యలను అక్కడికి అక్కడే పరిష్కరించేనీ దుకు చర్యలు తీసుకున్నారు.

భూముల వివరాలు నిషేధిత/ ప్రభుత్వ ఇతర జాబితాలో చేరితే వాటిని సరిదిద్దుతామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.ఈ పరిశీనలో జిల్లా సర్వే అధికారి మధుసూదన్, ఆర్డీవో అంబదాస్, తహసీల్దార్ ఆశోక్ , పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలంక పర్యటనకు బయలుదేరిన చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:అక్టోబర్ 12 నుంచి 16 వరకు శ్రీలంకలో పర్యటించేందుకు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సిఒఎఎస్), జనరల్ ఎంఎం నారావానే బయలుదేరారు. సిఒఎఎస్‌గా శ్రీలంకకు ఇది ఆయన తొలి పర్యటన.

ఈ పర్యటన సందర్భంగా ఆయన ఆ దేశపు సీనియర్ సైనిక, పౌర నాయకులతో సమావేశమై భారత్-శ్రీలంక మధ్య రక్షణ సంబంధాలను పెంచేందుకు మార్గాల గురించి చర్చించనున్నారు. భారత్ - శ్రీలంకల మధ్య గల అద్భుతమైన రక్షణ సహకారాన్నిముందుకు తీసుకువెళ్ళేందుకు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ భద్రతా యంత్రాంగంలోని సీనియర్ అధికారులతో బహుళ సమావేశాలు జరిపి, రక్షణకు సంబంధించిన పలు అంశాలపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. సర్వీస్ ఛీఫ్‌లతో సంభాషించడమే కాక, శ్రీలంక సైన్యం కేంద్ర కార్యాలయాన్ని, గజాబా రెజిమెంటల్ కేంద్రకార్యాలయం, శ్రీలంక మిలిటరీ అకాడెమిలను సందర్శిస్తారు.

భారత్ - శ్రీలంకల మధ్య జరుగుతున్న ఎక్సర్‌సైజ్ మిత్ర శక్తి విన్యాసాల అంతిమ ఘట్టాన్ని వీక్షించి, అనంతరం బటలాండాలోని డిఫెన్స్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజీలో విద్యార్థులను, అధ్యాపకులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ శ్రీలంక అధ్యక్షుడు, ప్రధానమంత్రిని కలువనున్నారు.

